

# దారుణం

- బాలికకు గంజాయి తాగించి ముగ్గురు రౌడీషీటర్ల అఘాయిత్యం
- నార్సింగి పోలీస్ స్టేషన్ పరిధిలో ఘటన



# మూడో రోజూ అదే జోరు

- పోలీస్ క్రీడల్లో పతకాలు సాధిస్తున్న వరంగల్ కమిషనరేట్

05

సంపుటి :02 | సంచిక :311 | పేజీలు :06 | www.aksharadarbar.com

# అక్షర దర్బార్

Voice of the People

వెల ₹5

గురువారం 19, ఫిబ్రవరి 2026

## పాలక వర్గం ప్రమాణ స్వీకారం



- ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు
- కొడవటంచ నూతన చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన ఎస్ఎస్ఆర్


02

- కాంట్రాక్టర్‌ను బినామీగా మలుచుకుని కోట్లు స్వాహా
- అవెన్యూ ప్లాంటేషన్, సుందరీకరణ పనుల్లో గోల్‌మాల్
- మార్గదర్శకాల ప్రకారం రూ.5 లక్షలకు పైగా పనులకు టెండర్లు తప్పనిసరి
- అంతకంటే.. తక్కువ ఉంటే కాంట్రాక్టర్లకు పనులు అప్పగించే అవకాశం
- ఈ లొసుగు వినియోగించుకుని దందా..
- రూ.50 లక్షల పనైనా బిట్లుగా విడదీత
- ఒక్కో పనిని రూ.5 లక్షల లోపు వర్క్‌గా కుదింపు

# 'సంతోష'ం సగం పాళ్లు

## ఉద్యాన పనులు గంగపాలు

### జీడబ్ల్యూఎంసీలో ఓ అధికారి దందా



05

వరంగల్ మహానగర పాలక సంస్థ (జీడబ్ల్యూఎంసీ)లో అవినీతి మొక్కలు ఏపుగా పెరుగుతున్నాయి. నగరాన్ని సుందరీకరించాల్సిన ఓ అధికారి, తన బినామీ కాంట్రాక్టర్‌తో కలిసి అక్రమ సంపాదనలో బిజీ అయిపోయారు. రూ. 5 లక్షల లోపు పనులకు టెండర్లు అవసరం లేదనే నిబంధనను ఆసరాగా చేసుకుని, రూ. కోట్లు విలువ చేసే పనులను చిన్న చిన్న బిట్లుగా విడగొట్టి నామినేషన్ పద్ధతిలో తన సన్నిహితుడికే కట్టబెడుతున్నారు. పాత పరిచయాలతో మొదలైన ఈ 'సంతోష' దందా.. గత రెండేళ్లలో సుమారు రూ. 7 కోట్లకు చేరినట్లు సమాచారం. ఎర్రమట్టి బదులు మొరం వాడుతూ, నాణ్యతను గాలికి వదిలేసి బిల్లులు స్వాహా చేస్తున్న ఈ అధికారి లీలలపై 'అక్షర దర్బార్' ప్రత్యేక కథనం..

– అక్షర దర్బార్,
వరంగల్ ప్రధాన ప్రతినిధి



## కర్రెగుట్టలో తుపాకుల మోత

- 5,000 మంది సీఆర్పీఎఫ్, కోబ్రా, గ్రేహౌండ్స్ బలగాలు మోహరింపు
- ఎదురుకాల్పుల్లో ఐదుగురు మావోయిస్టులు హతం?
- పార్టీ చీఫ్ 'దేవ్‌జీ' లక్ష్యంగా ఆపరేషన్-2 కగార్

02

## కాటారంలో మార్మోగిన శివాజీ నినాదం

- మండలంలో ఘనంగా ఛత్రపతి శివాజీ జయంతి
- చారిత్రక వేడుకలకు వేదికగా మారిన వైనం

05





## 26 నుంచి అసెంబ్లీ సమావేశాలు

- రెండు వారాల పాటు కొనసాగింపు
- 28న రాష్ట్ర బడ్జెట్.. గతేడాది కంటే మెరుగైన పద్దు తేవాలనేది సర్కార్ ఆకాంక్ష
- ఆర్థిక మంత్రి మల్లు భట్టివిక్రమార్క ఆధ్వర్యంలో కసరత్తు

02

# 'సంతోషం' సగం పాళ్లు

## ఉద్యాన పనులు గంగపాలు




### జీడబ్ల్యూఎంసీలో ఓ అధికారి దందా

- కాంట్రాక్టర్ ను బినామీగా మలుచుకుని కోట్లు స్వాహా
- అవెన్యూ ప్లాంటేషన్, సుందరీకరణ పనుల్లో గోల్ మాల్
- మార్గదర్శకాల ప్రకారం రూ.5 లక్షలకుపైగా పనులకు టెండర్లు తప్పనిసరి
- అంతకంటే.. తక్కువ ఉంటే కాంట్రాక్టర్లకు పనులు అప్పగించే అవకాశం
- ఈ లొసుగు వినియోగించుకుని దందా.. రూ.50 లక్షల పనైనా బిట్లుగా విడదీత
- ఒక్కో పనిని రూ.5 లక్షల లోపు వర్క్ గా కుదింపు

**అక్షర దర్బార్, ప్రధాన ప్రతినిధి :**

గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ (జీడబ్ల్యూఎంసీ) పరిధిలో ఓ అధికారి చక్రం తిప్పుతున్నాడు. రూ.5 లక్షల లోపు ప్రభుత్వ అభివృద్ధి పనులను నామినేషన్ పద్ధతిలో కాంట్రాక్టర్లకు అప్పగించవచ్చనే మార్గదర్శకాలను, దన్నుగా చేసుకుని రూ.కోట్ల విలువైన పనులైనా, రూ.50 లక్షల విలువైన పనులనైనా.. చిన్న చిన్న పనులుగా విడగొడుతున్నాడు. ఏ పని అయినా రూ.5 లక్షల లోపు పనులుగా మారుస్తున్నాడు. తన కనుసన్నల్లో ఉంటూ, తాను చెప్పినట్లు వినే కాంట్రాక్టర్‌ను బినామీ చేసుకుని.. అతడు సొమ్ము చేసుకోవడమే కాకుండా, కాంట్రాక్టర్‌నూ 'సంతోష'పెడుతున్నాడు. ఆ కాంట్రాక్ట్ కంపెనీకే పనులన్నింటినీ అప్పనంగా అప్పగిస్తున్నాడు. సదరు అధికారి తన సొంత శాఖను వదిలి డిప్యూటేషన్ పై ఇక్కడ విధులు నిర్వహిస్తున్నారు. పబ్లిక్ సర్వెంట్‌గా ఉండకుండా స్వసేవలో బిజీ బిజీగా ఉన్నాడు.

### - అధికారి లీలలు ఎలా అంటే..

ఉదాహరణకు ఒకచోట నగర సుందరీకరణ, అవెన్యూ ప్లాంటేషన్ పనులకు రూ.50 లక్షలు ఖర్చవుతాయనుకుంటే, ప్రభుత్వం ఆ పనులకు టెండర్ ఆహ్వానించాల్సి ఉంటుంది. టెండర్ల ప్రక్రియలో ఏ కాంట్రాక్టర్ పనులకు తక్కువ రేట్లు కోట్ చేస్తే, ఆ కాంట్రాక్టర్‌కు పనులు అప్పగించాల్సి ఉంటుంది. తద్వారా ప్రభుత్వ ఖాజానాకు కొంత ఆదాయం వస్తుంది. పనులన్నీ ఒక యూనిటీ ఉంటుంది. నాణ్యతా ప్రమాణాలకూ పరిశీలనకు యంత్రాంగానికి వెసులుబాటు కలుగుతుంది. కానీ, ఈ అవకాశాలేవీ లేకుండా సదరు డిప్యూటేషన్ అధికారి ఆ రూ.5ం లక్షల విలువైన పనులను పది పనులుగా విడదీస్తున్నాడు. అంటే.. ఒక్కో పని విలువ.. రూ.5 లక్షలు దాటకుండా.. రూ.4,99,999 చొప్పున 10 పనులుగా విడగొడుతున్నాడు. ఆ పనులను తన బినామీగా ప్రచారంలో ఉన్న కాంట్రాక్టర్ కంపెనీకి నామినేషన్ పద్ధతిన కేటాయిస్తున్నారు. ఆ కాంట్రాక్టర్ ఒక్కో పనిని అత్యంత నాశిరకంగా చేపట్టి, డబ్బులు మిగుల్చుకుంటున్నాడు. బిల్లులు వచ్చాక సదరు అధికారి, ఈ కాంట్రాక్టర్ పప్పు బెల్లాల్లా సొమ్మును పంచుకుంటున్నట్లు తెలిసింది. ఆ అధికారి రెండేళ్ల నుంచి దందా చేస్తున్నట్లు సమాచారం.

### - సొంత పోస్టింగ్ వద్దకు కాంట్రాక్టర్ దిగుమతి

సదరు అధికారి గతంలో వరంగల్ జిల్లాలోని గ్రామీణ ప్రాంతంలో తన సొంత శాఖలో పనిచేశాడు. అక్కడే తనను 'సంతోష'పెట్టే కాంట్రాక్టర్‌తో ఆయనకు పరిచయమైంది. వాళ్ల మైత్రి ఇక జీడబ్ల్యూఎంసీకీ వచ్చింది. ఈ అధికారి డిప్యూటేషన్‌పై గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కు వచ్చాడు. వస్తూ.. వస్తూ.. తన పాత బంధాన్నీ తెచ్చుకున్నాడు. ఇక్కడ ఇద్దరూ కొత్త గల్లాపెట్టె తెరిచి కాంట్రాక్టుల దందా షురూ చేశారు. రెండేళ్ల నుంచి ఏ చీకూచింతా లేకుండా కాంట్రాక్టుల దందా చేస్తున్నారు. ఏతా వాతా ఇద్దరూ కలిసి నామినేషన్ పనుల దందా ఎంత చేశారంటే.. గత రెండేళ్లలో అక్షరాలా సుమారు రూ.6 కోట్లు నుంచి రూ.7 కోట్ల వరకు ఉంటుందని అంచనా. నామినేషన్ పనులను కూడా సదరు అధికారి తన బినామీ కాంట్రాక్టర్ కంపెనీకి 40 శాతం ఎక్సెస్ రేట్లతో అప్పగిస్తున్నట్లు టాక్.

### - తగ్గుతున్న పనుల నాణ్యత

ఈ అధికారి, సదరు కాంట్రాక్టర్ దందా కారణంగా నగర పాలక సంస్థ పరిధిలో చేపడుతున్న ఉద్యాన పనులు నాణ్యతాగా ఉండటం లేదనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. వారి ధన దాహం కారణంగా సుందరీకరణ, అవెన్యూ ప్లాంటేషన్, మొక్కల పెంపకం పనులు నాశిరకంగా ఉంటున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. మొక్కల వద్ద ఎర్రమట్టి వాడాల్సి ఉండగా, ఎర్ర మొరం వాడుతున్నారనే ఫిర్యాదులు ఉన్నట్లు సమాచారం. అంతేకాదు నిర్దేశిత నామినేషన్ పనులు వంద శాతం పూర్తి కాకపోయినా పూర్తయినట్లు చెల్లింపులు జరుగుతున్నాయని ఆరోపణలు లేకపోలేదు. ఈ దందాపై ఇప్పటికైనా ఉన్నతాధికారులు దృష్టి సారించాల్సి ఉంది.

# కర్రెగుట్టలో తుపాకుల మోత

- 5,000 మంది సీఆర్పీఎఫ్, కోబ్రా, గ్రేహౌండ్స్ బలగాలు మోహరింపు
- ఎదురుకాల్పుల్లో ఐదుగురు మావోల హతం?
- పార్టీ చీఫ్ 'దేవ్ జీ' లక్ష్యంగా ఆపరేషన్-2 కగార్



అక్షరదర్బార్, రాయ్‌పూర్/ములుగు : తెలంగాణ–ఛత్తీస్‌గఢ్ సరిహద్దుల్లోని దట్టమైన కర్రెగుట్ట అటవీ ప్రాంతం గురువారం ఉదయం తుపాకుల మోతతో దద్దరిల్లింది. మావోయిస్టుల నిర్మూలనే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం చేపట్టిన 'ఆపరేషన్ కగార్' కీలక దశకు చేరుకోవడంతో.. బలగాలు తమ దాడులను ఉధృతం చేశాయి. ఈ క్రమంలోనే 'ఆపరేషన్ కర్రెగుట్టలు–2' పేరుతో చేపట్టిన భారీ కూంబింగ్‌లో ఐదుగురు మావోయిస్టులు మరణించినట్లు సమాచారం. మృతుల్లో మావోయిస్టు పార్టీకి చెందిన కీలక అగ్రనేతలు ఉన్నట్లు ప్రాథమిక సమాచారం అందుతోంది. ములుగు జిల్లా వెంకటాపురం మండల సరిహద్దుల్లోని డోలి– జెల్లా అటవీ ప్రాంతంలో ఈ ఎన్‌కౌంటర్ చోటుచేసుకుంది. మావోయిస్టు పార్టీ ప్రస్తుత ప్రధాన కార్యదర్శి తిప్పరి తిరుపతి అలియాస్ దేవ్‌జీ ఈ ప్రాంతంలోనే తలదాచుకున్నారన్న పక్కా సమాచారంతో ఈ ఆపరేషన్ మొదలైంది. గత ఏడాది మే నెలలో నంబాల కేశవరావు అలియాస్ బసవరాజు ఎన్‌కౌంటర్‌లో మరణించిన తర్వాత.. జగిత్యాల జిల్లాకు చెందిన దేవ్‌జీ పార్టీ పగ్గాలు చేపట్టారు. ఆయనతో పాటు సోది, బడే చొక్కారావు వంటి కీలక నేతలు ఈ కొండల మీద ఉన్న బంకర్లలో ఆశ్రయం పొందుతున్నారని నిఘా వర్గాలు హెచ్చరించాయి. దీంతో సుమారు 5,000 మంది సీఆర్పీఎఫ్, కోబ్రా, గ్రేహౌండ్స్ మరియు డీఆర్జీ బలగాలు ఏకకాలంలో అడవిని అన్ని వైపుల నుండి చుట్టుముట్టాయి.

### - కూంబింగ్ ముమ్మరం

కర్రెగుట్ట ప్రాంతం అత్యంత ఎత్తుగా, లోయలతో కూడి ఉండటంతో గెరిల్లా యుద్ధానికి అనుకూలంగా ఉంటుంది. ఈ ప్రతికూల పరిస్థితుల్లో కూడా భద్రతా దళాలు డ్రోన్లు, హెలికాప్టర్లు మరియు శాటిలైట్ టెక్నాలజీని వాడుతూ ముందుకు సాగుతున్నాయి. గురువారం తెల్లవారుజామున బలగాలు అటవీ ప్రాంతంలోకి చొచ్చుకుపోతుండగా మావోయిస్టులు ఒక్కసారిగా కాల్పులు ప్రారంభించారు. ప్రతిగా బలగాలు జరిపిన ఎదురుకాల్పుల్లో ఐదుగురు నక్సలైట్లు ప్రాణాలు కోల్పోయారు. ఘటనా స్థలం నుండి భారీగా ఆయుధాలు, పేలుడు పదార్థాలను స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. కేంద్ర హోంమంత్రి అమిత్ షా నిర్దేశించిన 2026 మార్చి 31 డెడ్‌లైన్‌కు కేవలం 40 రోజులు మాత్రమే సమయం ఉండటంతో బలగాలు ఎక్కడా వెనక్కి తగ్గడం లేదు. దేశాన్ని మావోయిస్టు రహితంగా మార్చడమే లక్ష్యంగా జరుగుతున్న ఈ పోరులో కర్రెగుట్ట ఆపరేషన్ అత్యంత కీలకమైనదిగా భావిస్తున్నారు. ఈ పరిణామాల నేపథ్యంలో సరిహద్దు గ్రామాల్లో తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. భద్రాద్రి కొత్తగూడెం, ములుగు జిల్లాల్లో పోలీసులు హై అలర్ట్ ప్రకటించారు. మృతుల పూర్తి వివరాల కోసం గాలింపు చర్యలు ముమ్మరంగా కొనసాగుతున్నాయి.

# పాలక వర్గం ప్రమాణ స్వీకారం

- ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు
- కొడవటంచ నూతన చైర్మన్ గా బాధ్యతలు స్వీకరించిన ఎన్ఎస్ఆర్



అక్షరదర్బార్, రేగొండ: జయశంకర్ భూపాలపల్లి జిల్లా రేగొండ మండలంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం కొడవటంచ శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి దేవాలయ నూతన పాలక వర్గం ప్రమాణ స్వీకార మహోత్సవం గురువారం వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమానికి భూపాలపల్లి శాసనసభ్యులు శ్రీ గండ్ర సత్యనారాయణ రావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు.

### - అభివృద్ధికి కృషి చేయాలి

ఆలయ నూతన చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన నాయినేని సంపత్ రావును ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నూతన పాలక వర్గ సభ్యులందరూ సమన్వయంతో పనిచేసి, క్షేత్ర అభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషి చేయాలని పిలుపునిచ్చారు.

### - భక్తులకు మెరుగైన సౌకర్యాలు

దూర ప్రాంతాల నుండి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ పరిసరాల్లో మరిన్ని వసతులు కల్పించేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే సూచించారు. దేవాలయ అభివృద్ధి పనులకు ప్రభుత్వం తరపున, తన వంతుగా పూర్తి సహకారం అందిస్తానని ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు, భక్తులు పాల్గొన్నారు.

# మిగిలింది 300 మంది మావోయిస్టులే

అక్షరదర్బార్, న్యూఢిల్లీ : దేశవ్యాప్తంగా ప్రస్తుతం కేవలం 300 మంది మావోయిస్టులు మాత్రమే మిగిలి ఉన్నారని సీఆర్పీఎఫ్ వర్గాలు వెల్లడించాయి. కేంద్ర ప్రభుత్వం నిర్దేశించిన మార్చి 31 గడువు సమీపిస్తున్న తరుణంలో భద్రతా దళాలు ఆపరేషన్ కగారును ముమ్మరం చేశాయి. ఛత్తీస్‌గఢ్, తెలంగాణ సరిహద్దులతో పాటు జార్ఖండ్‌లోని కొన్ని ప్రాంతాల్లోనే వీరి కదలికలు పరిమితమయ్యాయి. అగ్ర నాయకత్వంలో కూడా భారీగా కోత పడి ప్రస్తుతం సెంట్రల్ కమిటీలో కేవలం నలుగురు సభ్యులు మాత్రమే మిగిలారు. గణపతి, దేవుజీ, మల్లా రాజారెడ్డి, మిసిర్ బెస్రా వంటి నేతల కోసం 2 వేల మంది బలగాలతో కేజీహెచ్–2 పేరుతో భారీ సెర్చ్ ఆపరేషన్ కొనసాగుతోంది. గత పదిహేనేళ్లలో మావోయిస్టు హింస 88 శాతం తగ్గి మరణాల సంఖ్య గణనీయంగా పడిపోయింది. ఈ తుది పోరాటంలో భాగంగా ఇప్పటికే ఐదుగురు మావోయిస్టులు మృతి చెందగా మిగిలిన వారిని లొంగిపోయేలా చేయడం బలగాలు ముందుకు సాగుతున్నాయి.



పరకాల పట్టణంలో విశ్వహిందూ పరిషత్— భజరంగ్ దళ్ ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ

# ఘనంగా ఛత్రపతి శివాజీ జయంతి

- వీహెచ్ పీ, బజరంగ్ దళ్ ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ
- శివాజీ విగ్రహాలకు పూలమాలలు వేసి పాలాభిషేకాలు
- ఆస్పత్రుల్లో రోగులకు పండ్లు పంపిణీ
- పలుచోట్ల స్వీట్లు పంపిణీ..

అక్షర దర్బార్, పరకాల: భారతీయ పరాక్రమానికి ధైర్య సాహసాలకు నిలువుటద్దం స్వరాజ్య –స్థాపకుడు. చత్రపతి శివాజీ మహారాజ్ జయంతి వేడుకల సందర్భంగా విశ్వ హిందూ పరిషత్ – భజరంగ్ దళ్ పరకాల శాఖ ఆధ్వర్యంలో పట్టణంలో భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా శివాజీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ముఖ్య అతిథిగా డా. నాగబండి విద్యాసాగర్ హాజరయ్యారు. కార్యక్రమంలో విశ్వ హిందూ పరిషత్ వరంగల్ జిల్లా సహ కార్యదర్శి గండ్ర శ్రీనివాస్ రెడ్డి, పట్టణ కారదర్శి సుర రఘు,ఉపాధ్యక్షులు యుగేందర్ . భజరంగ్ దళ్ సంయోజక్ పేరాల రమేష్, రాజు తుమ్మ సతీష్, యుగేంద్ర చారీ బిజెపి కౌన్సిలర్లు కుక్కల విజయ్ కుమార్,ఆకుల లావణ్య శ్రీధర్, బిజెపి నాయకులు జయంత్ లాల్ , రజనీకాంత్, పురుషోత్తం, అఖిల్ , గోపినాథ్, తదితరులు పాల్గొన్నారు.

## శివాజీ మహారాజ్ త్యాగాలు చిరస్మరణీయం

అక్షర దర్బార్, వెంకటాపూర్ : శివాజీ మహారాజ్ భారత జాతికి చేసిన సేవలు చిరస్మరణీయమని చత్రపతి శివాజీ మహారాజ్ విగ్రహ ప్రతిష్టాపన కమిటీ సభ్యులు మాదాసు అజయ్ పేర్కొన్నారు. గురువారం మండల కేంద్రంలో శివాజీ మహారాజ్ 395 వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి పాలాభిషేకాలు చేశారు. అనంతరం యువత కాషాయ జెండాలు పట్టుకుని బైక్ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మామిడి శెట్టి సుగుణ స్వామి, ఉప సర్పంచ్ అన్నె బోయిన రాజు, మిల్కూరి ఐలయ్య, ,పోశాల వీరమల్లు, పల్నాటి రమేష్,జంగిలి రవి,కాయిత రవి,కూరెళ్ల రామాచారి, బానోత్ సునీల్, నల్ల కోటి,నరెడ్ల వేణు,శ్రవణ్, గంగుల రాజ్ కుమార్, సాంబరాజ్ కిరణ్, వీరేందర్, యోగి, రాజు, బ్రహ్మచారి,మహేష్, కృష్ణ, శ్రీకుమార్, నవీన్, తదితరులు పాల్గొన్నారు.

## ఛత్రపతి శివాజీ జయంతి వేడుకలు

అక్షరదర్బార్, పరకాల: పరకాల మండల కేంద్రంలో ఆరే సంక్షేమ సంఘం మండల, పట్టణ కమిటీ ఆధ్వర్యంలో ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆరే సంక్షేమ సంఘం నాయకులు ఈ సందర్భంగా శివాజీ మహారాజ్ విగ్రహానికి పూలమాలలు వేసి స్వీట్స్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల సంఘం అధ్యక్షులు ఎద్దె రమేష్ బాబు, మండల ప్రధాన కార్యదర్శి ఆడగాని జనార్దన్ రావు, పట్టణ అధ్యక్షుడు నాగుర్ల శ్రీనివాస్ రావు, జిల్లా ఉపాధ్యక్షులు నాగుర్ల రాజేశ్వర్ రావు, వడికారి శివాజీ, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## నడికూడ మండలంలో..

అక్షరదర్బార్, పరకాల: నడికూడ మండలంలో ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. మండల అధ్యక్షుడు లోకటి నగేష్, గ్రామ అధ్యక్షుడు ఎండిగా నగేష్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా సర్పంచ్ కుడ్ల మల్హాల్ రావు, ఉప సర్పంచ్ సంపత్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శి సాయిని భిక్షపతి, రైతు రక్షణ కమిటీ మండల అధ్యక్షుడు వాంకే రాజు, కుల పెద్దలు మరియు గ్రామస్థులు శివాజీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

## దుగ్గొండిలో ఘనంగా ..

అక్షర దర్బార్, దుగ్గొండి: దుగ్గొండి మండల ఆరే సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో గురువారం ఛత్రపతి శివాజీ మహరాజ్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. దుగ్గొండి గ్రామం నుంచి వెంకటాపురం, శివాజీ నగర్, రేకంపల్లి గిర్నిబావి వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా గౌరవ అధ్యక్షుడు సుకినె రాజేశ్వరరావు, జిల్లా ఉపాధ్యక్షులు గుండెకారి రవికుమార్, వోలిగే నర్సింగరావు మాట్లాడుతూ భారత చరిత్రలో అపూర్వ వీరుడు, స్వరాజ్య స్వప్నానికి రూపం ఇచ్చిన మహనీయుడు శివాజీ మహారాజు అని కొనియాడారు. దుగ్గొండి, స్వామిరావుపల్లి, వెంకటాపురం, శివాజీ నగర్, రేకంపల్లి, చాపల బండ, మధిర, లక్ష్యంపురం, బంధంపల్లి, పొనక్కల్ తదితర గ్రామాల్లో జయంతి వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆరే సంక్షేమ సంఘం నాయకులు, మార్కెట్ కమిటీ డైరెక్టర్ హింగె రామారావు, సర్పంచులు డ్యాగం శివాజీ, సుకినె నాగరాజు, అల్లాటి ప్రభు, మాజీ సర్పంచులు, మాజీ ఎంపీటీసీలు, సంఘ ప్రతినిధులు, గ్రామ పెద్దలు, ఆరే కులస్తులు పాల్గొన్నారు.

## చత్రపతి శివాజీ ఆశయాలను కొనసాగించాలి

అక్షర దర్బార్ శాయంపేట : శాయంపేట మండలంలోని హుస్సేన్ పల్లి గ్రామంలో చత్రపతి శివాజీ మహారాజ్ జయంతి వేడుకలను ఆరె సంక్షేమ సంఘం అధ్యక్షులు గుజ్జుల రాజు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సర్పంచ్ ఎడ్ల స్వరూప సుధాకర్ రావు హాజరై మాట్లాడుతూ చత్రపతి శివాజీ ఆశయాలను కొనసాగించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ నాగలగాని లక్ష్మణరావు, ఎడ్ల బాపూరావు, వజీర్ శంకర్రావు, నిరంజన్ మోత్తయ్య మల్లయ్య మహేందర్ శ్రీనివాస్ గోపాల్ రాజు రాజేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## ధైర్య సహసాలకు మారు పేరు ఛత్రపతి శివాజీ

## మల్హర్ లో ఘనంగా చత్రపతి శివాజీ జయంతి వేడుకలు

అక్షర దర్బార్, మల్హర్ : దేశభక్తి, ధైర్య సాహసాలకు మారుపేరు ఛత్రపతి శివాజీ మహారాజ్ అని వారి జీవితాన్ని నేటి యువత స్ఫూర్తిగా తీసుకొని ముందుకు సాగాలని యూత్ నాయకులు బండి రణదీర్ రావు, సుంకరి సాయి అన్నారు. గురువారం మండల కేంద్రంలోని తాడిచెర్ల హనుమాన్ సెంటర్లో ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంతి వేడుకలను యూత్ నాయకుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించి ఛత్రపతి శివాజీ మహారాజ్ చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించి మాట్లాడారు. హిందూ ధర్మ పరిరక్షణ కోసం మొగల్ రాజులను ఎదురించి పోరాడిన యోదుడని హిందూ ధర్మ పరిరక్షణ కోసం వారు చేసిన సేవలు ఎనలేనివని అన్నారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా మాజీ సర్పంచ్ మల్క మోహనరావు, తెలంగాణ ఉద్యమ కారులు పోలోజు సత్యనారాయణ, యుత్ నాయకులు ముడితనపెల్లి మల్లీకార్జున్, పెద్ది మధూకర్, తిక్క వినయ్, రావుల రాహుల్, శేనం నిఖిల్, రావుల శశి, పైడాకుల సందీప్, జె రాజేందర్, సాయి చరణ్, ప్రదీప్, అబినవ్, అఖీల్, లడ్డూ, చరణ్ పాల్గొన్నారు.







పరకాల పట్టణంలో..



దుగ్గొండి మండల కేంద్రంలో..



శాయంపేట మండలంలోని హుస్సేన్ పల్లి గ్రామంలో..



మల్హర్ మండల కేంద్రంలోని తాడిచెర్ల హనుమాన్ సెంటర్లో..



## మున్సిపల్ చైర్మన్ కి ఘన సన్మానం

అక్షర దర్బార్, నర్సంపేట : బాలాజీ మహిళా డిగ్రీ అండ్ పీజీ కళాశాలలో నర్సంపేట మున్సిపల్ చైర్‌పర్సన్ శ్రీ లక్ష్మి రామానంద్ దంపతులకు గురువారం బాలాజీ మహిళా డిగ్రీ అండ్ పీజీ కళాశాలలో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో బాలాజీ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ రాజేంద్రప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ.. నర్సంపేట మున్సిపల్ చైర్‌పర్సన్ శ్రీలక్ష్మి ఆధ్వర్యంలో పట్టణం అభివృద్ధి మార్గంలో ముందుకు తీసుకెళ్లాలని ఆకాంక్షించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ శ్రీ లక్ష్మి రామానంద్ మాట్లాడుతూ.. విద్యార్థులకు రంజాన్ మాస ప్రారంభ శుభాకాంక్షలు మరియు ఛత్రపతి శివాజీ జయంతి ఉత్సవాల శుభాకాంక్షలు తెలియజేశారు. మహిళలు స్పష్టమైన లక్ష్యాన్ని నిర్దేశించుకుని దాని సాధనకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో విద్యాసంస్థల సెక్రటరీ డాక్టర్ రాజేశ్వర్ రెడ్డి, ట్రెజరర్ డాక్టర్ వనజ , బాలాజీ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ మోర్తాల రామరాజు , బిట్స్ స్కూల్ ప్రిన్సిపాల్ జ్యోతి పాల్గొన్నారు.




## ప్రకృతి వ్యవసాయంపై రైతులకు శిక్షణ

అక్షరదర్బార్, పరకాల: నడికూడ మండలం ముస్త్యాలపల్లి గ్రామంలో గురువారం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో 'నేషనల్ మిషన్ ఆన్ నాచురల్ ఫామింగ్' పథకం కింద ప్రకృతి వ్యవసాయంపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో స్పందన ఎన్‌జీఓ ప్రతినిధులు కూడా పాల్గొన్నారు. రైతులు తమ భూమిలో కనీసం కొంతభాగంలోనైనా రసాయన ఎరువులు, పురుగుమందులు వాడకుండా సహజ పద్ధతుల్లో పంటలు సాగు చేయాలని అధికారులు సూచించారు. గోమయం, గోమూత్రం వినియోగం, జీవామృతం, ఘనజీవామృతం, బీజామృతం తయారీ విధానాలు, మల్చింగ్ ద్వారా నేల తడి సంరక్షణ, మిశ్రమ మరియు అంతర పంటల సాగుపై అవగాహన కల్పించారు. కార్యక్రమం అనంతరం గ్రామంలోని బీఆర్‌సీ కేంద్రంలో జీవామృతం, బీజామృతం తయారీని ప్రత్యక్షంగా ప్రదర్శించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి పోరిక జైసింగ్, వ్యవసాయ విస్తీర్ణ అధికారులు జనగం ప్రదీప్, మాదారపు రామకృష్ణ, స్పందన ఎన్‌జీఓ ప్రతినిధి దేవేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఇంటెలిజెన్స్ ఆరా

- వైద్య అధికారి వసూళ్లపై సమాచార సేకరణ
- ఉద్యోగాల పేరుతో క్యాష్ కలెక్షన్ పై సర్వత్రా చర్చ
- అయోమయంలో నిరుద్యోగులు
- 'అక్షరదర్బార్' కథనంతో యంత్రాంగం అప్రమత్తం

అక్షరదర్బార్, పరకాల : పరకాల పట్టణంలో నూతనంగా నిర్మించిన 100 పడకల ప్రభుత్వ ఆసుపత్రి త్వరలో ప్రారంభం కానున్న నేపథ్యంలో ఉద్యోగాల ఆశతో ఉన్న నిరుద్యోగులను లక్ష్యంగా చేసుకుని మోసం జరుగుతోందన్న ఆరోపణలు కలకలం రేపుతున్నాయి. పట్టణానికి చెందిన ఓ డిప్యూటీ సివిల్ సర్జన్ తాను త్వరలో ఆ ఆసుపత్రికి సూపరింటెండెంట్‌గా నియామకం అవుతానని ప్రచారం చేసుకుంటూ.. అవుట్‌సోర్సింగ్ ఉద్యోగాలు ఇప్పిస్తానంటూ పలువురి నుంచి డబ్బులు వసూలు చేస్తున్నట్లు సమాచారం. దీనిపై బుధవారం 'అక్షరదర్బార్' పత్రికలో ప్రచురితమైన 'సూపరింటెండెంట్ గా వస్తా.. ఉద్యోగాలు ఇస్తా!' కథనంతో అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. ఈ కథనంపై స్థానికంగా తీవ్ర చర్చ సాగుతుండగా, ఇంటెలిజెన్స్ విభాగాలు ప్రాథమిక విచారణ ప్రారంభించినట్లు తెలిసింది. ఆ వైద్యాధికారి ఎవరెవరినుంచి ఎంత మొత్తంలో డబ్బులు తీసుకున్నారనే అంశంపై ఆరా తీస్తూ వివరాలు సేకరిస్తున్నట్లు సమాచారం. కొందరు బాధితులు ఉద్యోగాలు వస్తాయో లేదోనన్న అనుమానంతో డబ్బులు ఇచ్చిన నిరుద్యోగులు అయోమయానికి గురవుతూ తమ ఆవేదన వ్యక్తం చేస్తున్నట్లు తెలుస్తోంది. సంబంధిత అధికారి గతంలోనూ ఇతర ప్రాంతాల్లో ఇలాంటి ఆరోపణలు ఎదుర్కొన్నారనే ప్రచారం కూడా పట్టణంలో ఊపందుకుంది. ఈ ఘటనపై అధికారికంగా స్పష్టత రావాల్సి ఉంది. అయితే ఉద్యోగాల పేరుతో డబ్బులు వసూలు చేసినట్లు నిర్ధారణ అయితే కఠిన చర్యలు తప్పవని వైద్య వర్గాలు పేర్కొంటున్నాయి.


సూపరింటెండెంట్ గా వస్తా..
ఉద్యోగాలు ఇస్తా!
03
నిరుద్యోగుల నుంచి దండిగా వసూలు
పరకాల ప్రభుత్వ ఆసుపత్రి పేరిట 'జాబుల' మోసం..
అక్షర దర్బార్ www.aksharadarbar.com Voice of the peopl
18 Feb 2026 - Page 1
https://www.aksharadarbar.com/epaper/clip/22430

# రక్తదానంతో ప్రాణదానం

అక్షరదర్బార్, హనుమకొండ: తలసేమియా బాధిత చిన్నారుల కోసం ఎన్ఎస్ఎస్ ఫౌండేషన్ వరంగల్ ఆధ్వర్యంలో గురువారం రక్తదాన శిబిరం నిర్వహించారు. ఛత్రపతి శివాజీ మహరాజ్ జయంతి సందర్భంగా హనుమకొండలోని ఇండియన్ రెడ్ క్రాస్ బ్లడ్ బ్యాంక్‌లో శిబిరాన్ని ఏర్పాటు చేశారు. శిబిరాన్ని రెడ్ క్రాస్ రాష్ట్ర పాలకవర్గ సభ్యుడు ఈవీ శ్రీనివాస్ రావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తలసేమియా చిన్నారులకు నిరంతరం రక్తం అవసరమవుతుందని, రక్తదానం ద్వారా వారికి పునర్జన్మ కలిగించవచ్చని తెలిపారు. ముఖ్యంగా వేసవికాలంలో రక్తం కొరత అధికంగా ఉంటుందని, యువత స్వచ్ఛందంగా ముందుకు వచ్చి రక్తదానం చేయాలని పిలుపునిచ్చారు. ఈ శిబిరంలో




సుమారు 40 మంది రక్తదాతలు పాల్గొని రక్తదానం చేశారు. అనంతరం రక్తదాతలకు సర్టిఫికెట్లు అందజేసి అభినందించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ఫౌండేషన్ ప్రతినిధులు, రెడ్ క్రాస్ సభ్యులు, స్వచ్ఛంద సేవకులు పాల్గొన్నారు.



## అభివృద్ధిపై దృష్టి

అక్షర దర్బార్ శాయంపేట : శాయంపేట సర్పంచ్ చింతల ఉమా రవిపాల్ గ్రామంలో సందర్శించి సమస్యలను అడిగి తెలుసుకుంటున్నారు. గ్రామంలో ఉన్న సమస్యలను ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు నెరవేర్చే పనిలో నిమగ్నమయ్యారు. అందులో భాగంగా పారిశుద్ధ కార్యక్రమానికి పెద్దపీట వేస్తూ గ్రామంలో మురుగు కాలువలను శుభ్రం చేయించారు. పలు కాలనీలో నీటి సమస్య ఉందని సరైన నీటి సౌకర్యం కల్పించేందుకు అధికారులతో మాట్లాడి నీటి సౌకర్యం కల్పించే విధంగా చర్యలు చేపట్టారు.

## ఘనంగా ఫేర్ వెల్ డే సెలబ్రేషన్స్

అక్షర దర్బార్, నర్సంపేట : పట్టణంలోని ఎస్ ఆర్ వొకేషనల్ కళాశాలలో ఫేర్‌వెల్ డే వేడుకలు విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల సమక్షంలో ఆనందోత్సాహాల మధ్య నిర్వహించారు. కళాశాల కరెస్పాండెంట్ కొయ్యడి సనత్ కుమార్ ముఖ్య అతిథిగా పాల్గొని విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ, విద్యార్థి దశ జీవితంలో కీలకమైనదని, , ఈ సమయంలో అలవర్చుకున్న విలువలు, సంపాదించిన జ్ఞానం భవిష్యత్తుకు బలమైన పునాది అవుతాయని తెలిపారు. ప్రిన్సిపాల్ కొయ్యడి శిరీష మాట్లాడుతూ, స్పష్టమైన లక్ష్యంతో సమయాన్ని సద్వినియోగం చేసుకుంటే విజయం సాధ్యమని చెప్పారు. విద్యార్థుల భవిష్యత్తు ఉజ్వలంగా ఉండాలని ఆకాంక్షించారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ కొయ్యడి సరళ , కళాశాల వైస్ ప్రిన్సిపల్ అజ్మీర సూరయ్య, లెక్చరర్స్ పాలడుగుల సంతోష్, లయన్ ప్రవీణ్, నువ్వునావత్ రమేష్, బాదావత్ దేవ్ సింగ్, దొంతర బోయిన నగేష్, బోడ వెంకన్న, బి హరి భూషణ్ ఓరుగంటి సందీప్, ఓరుగంటి శ్వేత, జటోదు సునీత, శీలం షారోన్, శాతరాసి కుమార్, తదితరులు పాల్గొన్నారు.






## ఆరె సంక్షేమ సంఘం గ్రామ కమిటీ ఎన్నిక

### అధ్యక్షుడిగా రాజు, ప్రధాన కార్యదర్శిగా బాబురావు

అక్షరదర్బార్, పరకాల: నడికూడ మండలం నర్సక్కపల్లి గ్రామంలో ఆరే సంక్షేమ సంఘం గ్రామ కమిటీ ఎన్నికలు ఏకగ్రీవంగా జరిగాయి. గౌరవ అధ్యక్షుడిగా నాగూర్ల ధర్మారావు, అధ్యక్షుడిగా వరికెల రాజు, ప్రధాన కార్యదర్శిగా సురావు బాబురావు, కోశాధికారిగా లోనే సతీష్ ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా మొకిడి రాజన్న, ఎర్రబాటి వెంకటేశ్వర్లు, ఇటుకల నర్సింగరావు, సహాయ కార్యదర్శిగా ఓరవాలా రాజేశ్వరరావు ఎంపికయ్యారు. కార్యవర్గ సభ్యులుగా కానువాలా శ్యాంరావు, నాగూర్ల అభినేష్, ఇటీకాల నాగరాజు, పుష్కారి విజయ్ భాస్కర్ ఎన్నికయ్యారు.నూతన కమిటీకి జిల్లా ముఖ్య సలహాదారు నాగూర్ల సంతోష్ రావు, జిల్లా ఉపాధ్యక్షుడు వరికెల కిషన్ రావు, గ్రామ ప్రజలు అభినందనలు తెలిపారు. గ్రామ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల్లో ముందుండి పనిచేస్తామని కమిటీ సభ్యులు తెలిపారు.



# మూడో రోజూ అదే జోరు

- పోలీస్ క్రీడల్లో పతకాలు సాధిస్తున్న వరంగల్ కమిషనరేట్ పోలీస్ క్రీడాకారులు

అక్షరదర్బార్, హనుమకొండ: సైబారబాద్ కమిషనరేట్ లో ప్రారంభమైన రాష్ట్ర పోలీస్ గేమ్స్ అండ్ స్పోర్ట్స్ మీట్ లో వరంగల్ కమిషనరేట్ పోలీస్ క్రీడాకారులు మూడవ రోజు గురువారం కూడా జోరును కోనసాగించారు. ఈ క్రీడల్లో ఇప్పటి వరకు వరంగల్ పోలీస్ కమిషనరేట్‌కు చెందిన క్రీడాకారులు మొత్తం 42 పతకాలను సాధించగా ఇందులో 9 స్వర్ణ పతకాలు, రంజిత పతకాలు 15, కాంస్య పతకాలు 18 ఉన్నాయి. ఇప్పటి వరకు సాధించిన పతకాల్లో ప్రధానంగా అర్చరీ క్రీడల్లో పోలీస్ క్రీడాకారులు అద్భుత ప్రదర్శన చేస్తూ గురువారం ఇండియన్ ఒలంపిక్ విభాగంలో ఎస్ఐ అనిల్ కుమార్ స్వర్ణం గెలుచుకోగా, మరో క్రీడాకారుడు చలపతి కాంస్య పతకాన్ని సాధించాడు. ఇదే ఆర్చరీ క్రీడాంశంలో టీం విభాగం వరంగల్ కమిషనరేట్ క్రీడాకారులు ఎస్ఐ ఆనిల్ కుమార్, ఎస్ఐ మహేందర్ కానిస్టేబుళ్ళు రాహుల్, చలపతి బృందం స్వర్ణ పతకాన్ని సాధించారు. మరో క్రీడాంశంలో హ్యామర్ త్రో లో కానిస్టేబుల్ సురేందర్ స్వర్ణ పతకం గెలుచుకోగా, వెయిట్ లిప్పింగ్‌లో మహిళా కానిస్టేబుల్ భువనేశ్వరి రజిత పతకాన్ని సొంతం చేసుకుంది. పవర్ లిఫ్టింగ్ క్రీడలో కానిస్టేబుల్ కళ్యాణి రజితం, హెడ్ కానిస్టేబుల్ సుజాత, లత, కానిస్టేబుల్ సర్వేశ్ కాంస్య పతకాలను సాధించారు. మరి కొన్ని క్రీడల్లో వరంగల్ పోలీస్ కమిషనరేట్ క్రీడాకారులు వివిధ క్రీడల్లో ఫైనల్స్ చేరుకుని పతకాలను ఖాయం చేసుకున్నారు. ఈ సందర్భంగా పతకాలను సాధించిన పోలీస్ క్రీడాకారులకు వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్, టీం మేనేజర్ నాగయ్య అభినందనలు తెలిపారు.



# ఎస్సీ కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి భూమిపూజ

అక్షర దర్బార్, ములుగు జిల్లా ప్రతినిధి: ములుగు మండలం జంగాలపల్లి గ్రామంలో సుమారు రూ.5 లక్షల వ్యయంతో ఎస్సీ కాలనీలో కమ్యూనిటీ హాల్ నూతన భవన నిర్మాణానికి భూమిపూజ నిర్వహించారు. ములుగు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ భానోత్ రవిచందర్ కొబ్బరికాయ కొట్టి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రజా ప్రభుత్వం ఏర్పడ్డ తర్వాత ములుగు నియోజకవర్గంలో మంత్రి సీతక్క ఆధ్వర్యంలో ప్రతి గ్రామంలో అభివృద్ధి కార్యక్రమాలు వేగంగా కొనసాగుతున్నాయని తెలిపారు. రానున్న రోజుల్లో గ్రామాల్లో మరింత అభివృద్ధి సాధించేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ములుగు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఎండీ చాంద్ పాషా, డీసీసీ వైస్ ప్రెసిడెంట్ కునూరు అశోక్ గౌడ్, గ్రామ కమిటీ అధ్యక్షుడు జగన్నాథ చారి, గ్రామ సీనియర్ నాయకులు, యువ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# కాటారంలో మార్మోగిన శివాజీ నినాదం

- మండలంలో ఘనంగా ఛత్రపతి శివాజీ జయంతి వేడుకలు
- చారిత్రక వేడుకలకు వేదికగా మారిన వైనం
- భారీ సంఖ్యలో హాజరైన యువత
- శివాజీ జెండాలతో కాషాయమయమైన కాటారం
- సందడిగా మారిన పుర వీధులు



అక్షర దర్బార్, కాటారం :జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాటారం మండల కేంద్రం లో ఛత్రపతి శివాజీ నినాదాలు మార్మోగాయి.స్వరాజ్య స్థాపకుడైన ఛత్రపతి శివాజీ జయంతి ఉత్సవాలని గురువారం కాటారం మండలకేంద్రంలో అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఆయా గ్రామాల్లోని యువకులంతా ఉదయం నుంచే కాటారం చేరుకొని కాషాయపు జెండాలతో సందడి చేశారు. ఊరు, వాడ,పార్టీలనే తేడా లేకుండా అతీతంగా సుమారు 500 మందికి పైగా చేరుకొని ఛత్రపతి శివాజికి నివాళులు అర్పించారు.దీంతో కాటారం మండలకేంద్రం శివాజీ జెండాలతో కాషాయ మయంగా మారింది.ముఖ్యంగా శివాజీ మహారాజ్ మీద ఉన్న భక్తిని గుండెలో నిండుగా నింపుకున్న కాటారం యువత ఒక్కొక్కరుగా స్వచ్ఛందంగా రోడ్ల పైకి చేరుకొని శివాజీ నినాదాలతో హోరెత్తించారు.ముందుగా హనుమాన్ టెంపుల్ నుండి కాటారం ప్రధాన రహదారి మీదుగా బైక్ ర్యాలీ నిర్వహించారు.డీజే పాటల నడుమ పాదయాత్ర చేస్తూ నృత్యాలు చేయసాగారు.అనంతరం అన్నదానం కార్యక్రమాన్ని నిర్వహించారు.అలాగే ప్రభుత్వ పాఠశాలల్లో ఛత్రపతి శివాజీ జీవిత చరిత్ర పేరుతో వ్యాస రచన పోటీలు నిర్వహించి 100 మంది విద్యార్థులకు బహుమతులు అందజేశారు.

## అంతా ఏకమై.. సక్సెస్ కోసం నిలిచి..!!

ఛత్రపతి శివాజీ జయంతి ఉత్సవాలు రాకముందే కాటారం యువత ఏకమయ్యారు. గొప్ప యోధుడి స్ఫూర్తిని కాటారం మండల ప్రజల్లో నింపాలనే సంకల్పంతో ఛత్రపతి శివాజి సేన సమితి సభ్యులు అహర్నిశలు కష్టపడ్డారు.అనుకున్నట్లుగానే ఆ కమిటీ సభ్యులు ఒక్కొక్కరుగా కష్టపడుతూ మంచి ప్రణాళిక రూపొందించుకున్నారు.ఈ క్రమంలోనే మండలంలోని అన్ని గ్రామాల్లో ప్రజల్ని ఏకం చేస్తూ అవగాహన సదస్సులు చేపట్టారు.అందరూ వచ్చి శోభాయాత్రని సక్సెస్ చేసుకుని శివాజీ మహారాజ్ పై ఉన్న అభిమానాన్ని ఘనంగా చాటుకున్నారు.కార్యక్రమంలో కాటారం ఛత్రపతి శివాజీ సేన సభ్యులు కొట్టె సతీష్, పవిత్రం శ్రీనివాస్, అంజన్న, గోనె మహేష్, పసుల సందీప్, చీమల రాజు లు పాల్గొన్నారు.






# లారీ ఢీ కొని వ్యక్తి మృతి

అక్షర దర్బార్, దామెర: దామెర పోలీస్ స్టేషన్ పరిధి ఒగ్లాపూర్ గ్రామం వద్ద దమ్మన్న పేట వైపు నుంచి టూవీలర్ పై రహదారి దాటుతున్న ఓగ్లాపూర్ కి చెందిన సిలువేరు మల్లయ్య (50) ను హనుమకొండ వైపు నుంచి గూడెప్పాడ్ కు వెళ్తున్న లారీ వేగం గా వచ్చి ఢీకొట్టినది. దీంతో తీవ్రంగా గాయపడిన మల్లయ్య అక్కడికక్కడే మృతి చెందాడు. ఘటనా స్థలానికి పోలీసులు చేరుకొని వివరాలు సేకరించారు. మృతుడి భార్య సిలువేరు రాధ ఫిర్యాదు మేరకు లారీ డ్రైవర్ మామిడిశెట్టి శ్రీనివాస్ పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పరకాల రూరల్ సీఐ శ్రీ రంజిత్ రావు తెలిపారు.



# 26 నుంచి అసెంబ్లీ సమావేశాలు

- రెండు వారాల పాటు కొన సాగింపు
- 28న రాష్ట్ర బడ్జెట్..
- గతేడాది కంటే మెరుగైన పద్దు తేవాలనేది సర్కార్ ఆకాంక్ష
- ఆర్థిక మంత్రి మల్లు భట్టివిక్ర మార్క ఆధ్వర్యంలో కసరత్తు



అక్షరదర్బార్, హైదరాబాద్ : రాష్ట్ర అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు ఈ నెల 26 నుంచి ప్రారంభం కానున్నాయి. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రభుత్వం ఈ మేరకు నిర్ణయం తీసుకుంది. దాదాపు 10 నుంచి 15 రోజుల పాటు ఈ సభలు సాగే అవకాశం కనిపిస్తోంది. ఫిబ్రవరి 28వ తేదీన ఆర్థిక శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క 2026–27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన బడ్జెట్‌ను అసెంబ్లీలో ప్రవేశపెడతారు. గత ఏడాది కంటే ఈసారి నిధుల కేటాయింపులు భారీగా ఉంటాయని అధికార వర్గాలు భావిస్తున్నాయి. సంక్షేమ పథకాలు, మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోంది. దీనికి అనుగుణంగానే ఆర్థిక శాఖ అధికారులు తుది కసరత్తు చేస్తున్నారు. ఈ సమావేశాల్లో రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఆరు గ్యారంటీలపై ప్రధానంగా చర్చ జరిగే అవకాశం ఉంది. మహాలక్ష్మి, రైతు భరోసా వంటి పథకాలకు నిధుల కేటాయింపులపై స్పష్టత రానుంది. మూసీ పునరుజ్జీవన ప్రాజెక్టు, రీజినల్ రింగ్ రోడ్ వంటి ప్రతిష్టాత్మక మౌలిక సదుపాయాల పనులపై చర్చ సాగవచ్చు. ఇటీవల జరిగిన మున్సిపల్ ఎన్నికల ఫలితాల నేపథ్యంలో పట్టణ ప్రాంతాల అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించే వీలుంది. సాగునీటి ప్రాజెక్టుల పెండింగ్ పనులు, విద్యా రంగంలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్ల నిర్మాణం వంటి అంశాలపై సభలో చర్చలు జరిగే సూచనలు కనిపిస్తున్నాయి. ప్రతిపక్షాలు నిరుద్యోగ భృతి, ధరణి సమస్యలు, రుణమాఫీ అమలు వంటి ప్రజా సమస్యలపై ప్రభుత్వాన్ని నిలదీసే అవకాశం ఉంది. కృష్ణా, గోదావరి జలాల వాటాపై ఇరు రాష్ట్రాల మధ్య నెలకొన్న వివాదాలు కూడా చర్చకు రావచ్చు.




# మీ గొంతుక!
# మీ నమ్మకం!

## అక్షర దర్బార్

ప్రతి అక్షరం.. ప్రజా సంక్షేమం!

## ఎందుకు అక్షర దర్బార్?

- **నిజమైన వార్తలు** : నిష్పక్షపాతంగా, పారదర్శకంగా వార్తలను అందిస్తాం.
- **మీ సమస్యల పరిష్కారం** : స్థానిక సమస్యల నుండి ప్రభుత్వ పథకాల అమలు వరకు, మీ ప్రతి సమస్యను వెలుగులోకి తెస్తాం.
- **సమాజహితమే లక్ష్యం** : ప్రజల గొంతుకగా మారి, సామాజిక బాధ్యతతో పనిచేస్తాం.
- **ఈ-పేపర్ అందుబాటులో** : ఎక్కడ ఉన్నా, ఎప్పుడైనా మీ వార్తలను చదవండి.

డిజిటల్ విప్లవంలో భాగంకండి!

"అక్షర దర్బార్" ఈ-పేపర్ కోసం QR కోడ్‌ను స్కాన్ చేయండి.
వేగంగా, సులభంగా వార్తలను పొందండి.

**ప్రతిరోజూ మీ ఇంటికి, మీ మనసుకి చేరువగా "అక్షర దర్బార్"!**

**మీ నమ్మకమే మా బలం!**


Printed, Published & Owned by VEMULA RAJESHWER RAO, printed at VR PUBLICATIONS, H.NO 7-1-364/16/A, Sriram Nagar, Padmakshi gutta colony, Hanamkonda, Pin 506001, Telangana State.
Editor : VEMULA RAJESHWAR RAO, Email : akshardarbarnews@gmail.com, Office No:7680992278 *RNI N0.TELTEL/2022/81915